హైదరాబాద్ వార్త





హత్యకు గురైన నాగశివ (ఫైల్)

# నెమ్మదిగా వెళ్లమన్నందుకు చంపేశారు

### తీవ్రగాయాలతో యువకుడి మృతి

దుండిగల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త: సెప్టిక్‌ట్యాంకర్ డ్రైవర్‌ను నెమ్మదిగా వెళ్ళమని ఇద్దరు యువకులు వారించారు. దీంతో డ్రైవర్ అతని అనచరులు ఇద్దరు యువకులపై దాడికి దిగారు. పారిపోతుండగా వెంటబడి చితకబాదడంతో ఓ యువకుడు తలకు తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరి గుట్ట ప్రాంతానికి చెందిన నాగశివ(29) క్యాటరింగ్ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. బుధవారం తెలిసిన వాళ్ళను కలిసేందుకు నాగశివ అతని స్నేహితుడు మహమ్మద్ సోహెన్‌సమీర్‌తో కలిసి తన బైక్‌పై 3:30 గంటల ప్రాంతంతో గండిమైసమ్మలోని సత్యసాయి కాలనీకి చేరుకున్నారు. అక్కడ వేచి చూస్తుండగా ఓ సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్ వేగంగా దూసుకురావడంతో నెమ్మదిగా వెళ్ళమంటూ సమీర్, నాగశివలు వారించారు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో డ్రైవర్ అతని అనుచరులు సమీర్, నాగశివలపై దాడికి పాల్పడడంతో ఇరువురు ఒక్కో వైపుకు పరుగులు తీశారు. పారిపోతున్న నాగశివ వెంటబడి గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని కల్లకాంపౌండ్ వద్ద చేతి కడియంతో చితకబాదడంతో స్పృహతప్పి పడిపోయాడు. స్థానికుల సమాచారం ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు నాగశివను సూరారంలోని వైద్య శాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. దాడికి పాల్పడిన అనుష్‌బాగిడి, అరుణ్‌సింగ్ బాగిడి, విజయ్‌సింగ్‌బాగిడి, ఆసిస్‌చౌదరి, రాహుల్‌బాగిడి, అను రాంగ్ టాక్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేశారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో ముందు జాగ్రత్త చర్యలు

### ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్

అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 21 ప్రభాతవార్త: కోవిడ్ 19 కేసుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ఉస్మానియా ఆసుపత్రిలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు. ఆసుపత్రిల ఐసియూ, ఐసోలేషన్ వార్డులను ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్సలు పొందే, ఓపి,ఐపి రోగులకు ప్రధానంగా చికిత్సలు నిర్వహించే వైద్యులు పని చేసే సిబ్బంది తీసుకోవాల్సి జాగ్రత్తలపై దిశా నిర్దేశాలు చేసినట్లు చెప్పారు. కోవిడ్ 19 పట్ల భయపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరికి వారు భాద్యతగా మాస్కులు ధరించాలని సూచించారు. ఆసుపత్రిలో ముందుస్తుగా ఐసియు విభాగం సన్నద్ధం చేశామన్నారు. ఆసుపత్రిలో వెంటిలెటర్ల, లభ్యత, ఆక్సిజన్, సరఫరా, తగినన్నీ, ఆర్టిపీసిర్ కిట్లు మందులు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. మాస్కులు వాడడం, చేతుల పరిశుభ్రత చర్యలు, సామాజిక దూరం మొదలైన జాగ్రత్తను ఖచ్చితంగా పాటించాలన్నారు.



ముళ్లకంచెను తొలగింపజేయిస్తున్న ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, సెక్యూరిటీ ఆఫీసర్

## ఒయు పరిపాలనా భవనం ముందు ముళ్ల కంచెలు తొలగింపు

తార్నాక, డిసెంబర్ 21 ప్రభాతవార్త: విద్యార్థి నేతల ఆందోళనలతో ఎట్టకేలకు ఉస్మానియా యూనివ ర్సిటీ పరిపాలనా భవనం చుట్టు ఏర్పాటు చేయించిన ముళ్ల కెంచెను ఒ.యూ సెక్యూరిటీ అధికారులు, ఒ.యూ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు సిబ్బందితో తొలగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒ.యూలో ఆందోళనలను నిశేదించింది. దీంతో అప్పటి నుంచి ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. దీంతో క్యాంపస్‌లో ఆంక్షలను ఎత్తివేయాలని కోరుతూ ఒ.యూ నుంచి పలుమార్లు విధ్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు పలుమార్లు ఆందోళనలను చేసినా పట్టించుకోలేదు. ఎట్టకేలకు దిగివచ్చిన అధికారులు తొలగించారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రేమ విఫలమై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నాగచక్రపాణి (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, డిసెంబరు 21 ప్రభాతవార్త : ప్రేమ విఫలమై ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐటి కారిడార్ పరిధిలోని గచ్చిబౌలిలో చోటుచేసుకుంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇన్స్‌పెక్టర్ జేమ్స్‌బాబు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా ఆల్లగడ్డ మండలం బత్తులూరు గ్రామానికి చెందిన గజ్జల నాగచక్రపాణి(28) ఉద్యోగరిత్యా నగరానికి వచ్చాడు. గచ్చిబౌలిలోని శాన్వికా వర్కింగ్ పిజి హాస్టల్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా ఈనెల 20వ తేదీన సాయంత్రం నాగచక్రపాణి తాను నివాసం ఉంటున్న గదిలో సీలింగ్ ప్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన హాస్టల్ నిర్వాహకులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు నాగచక్రపాణి తండ్రి గజ్జల నాగశేషులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా నాగచక్రపాణి ఆత్మహత్యకు ప్రేమ విఫలం కావడమే కారణమని తండ్రి పిర్యాదులో పేర్కొన్నాడు. తన కుమారుడు కొంతకాలంగా ఓ మహిళను ప్రేమిస్తున్నాడని, ప్రేమలో విఫలం కావడంతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానం వ్యక్తం చేశాడు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

## కార్మికుల హక్కులు అమలు కోసం కాంగ్రెస్ కృషి

### రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐఎన్‌టియుసి నేతలు

సైఫాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త: కార్మికుల సంక్షేమం, హక్కులు, చట్టాల అమలు కోసం ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అలాగే ఆటో డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వారికి అన్యాయం చేయకుండా త్వరలో న్యాయం చేస్తామని మంత్రి చెప్పారు. ఐఎన్‌టియుసి ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరి సింహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదాం మల్లేష్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు శంకర్‌లాల్ రామావత్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం గురువారం మం త్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్‌లలో ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కాని ఆటో డ్రైవర్లకు గిరాకిలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారని విచారం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఐఎన్‌టియుసి నాయకులు ఈ.నాగరాజు, మల్లేష్, శంకర్, బోడ్యానాయక్, రాములునాయక్, రవినాయక్ ఉన్నారు.

# నష్టాల నివారణ ఎలా?

- డిస్కం నెత్తిన మొండి బకాయిలు
- గ్రేటర్‌లో భారీగా పెండింగ్ విద్యుత్ బిల్లులు
- అత్యధికంగా రెండు సర్కిళ్లలోనే 200 కోట్లు
- హైదరాబాద్ సౌత్ 103కోట్లు
- రాజేంద్రనగర్ 84కోట్ల బకాయిలు
- ప్రభుత్వ సంస్థలనుంచి భారీగా పెండింగ్



హైదరాబాద్, డిసెంబరు 21,ప్రభాతవార్త: గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరిగిపోతుంది. దీనికితోడు నష్టాలు కూడా పెరగుతున్నాయి. దీంతో గ్రేటర్ జోన్ పరిధిలోని డిస్కంకు ప్రతినెలా రూ.50-60కోట్లకు పైగా నష్టం వస్తోంది. గ్రేటర్ జోన్‌లో రోజూ 50-60మిలియన్ల యూనిట్స్ సరఫరా చేస్తుండగా వాటిలో 10-11శాతం నష్టాలను రికార్డుల్లో చూపుతున్నారు. 9 సర్కిళ్లలో మొత్తం 60లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటిలో కమర్షియల్, హెచ్‌టీ కనెక్షన్లు 8లక్షల వరకు ఉన్నాయి. వీటికితోడు ప్రతిఏడాది నగరంలో 10శాతం విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. అయితే విద్యుత్ కనెక్షన్లు లక్షల్లో పెరుగుతున్నా సరఫరాలో నష్టాలను మాత్రం అధికారులు అరికట్టలేకపోతున్నారు. సాంకేతిక నష్టాల పేరుతో లెక్కలు చూపిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ముఖ్యంగా 9సర్కిళ్లలో 40శాతంగా నష్టాలు నమోదవుతున్నాయి. గత ప్రభుత్వంలో అధిక నష్టాలు వస్తున్న సర్కిళ్ల ను ప్రైవేట్ పరం చేస్తారనే ప్రచారం కూడా గతంలో జరిగింది. అయినా నష్టాలను నివారించుకునేందుకు అధికారులు పెద్దగా చర్యలు తీసుకోలేదు. దీంతో విద్యుత్ సరఫరా నష్టాలను అరికట్టకపోతే భవిష్యత్తులో భారంగా మారే అవకాశం ఉందని విద్యుత్‌రంగనిపుణులు హెచ్చరిస్తున్నారు.

**రెండు సర్కిళ్లలో 200 కోట్లు..** గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్లలో పాతబస్తీ కేంద్రంగా ఉన్న హైదరాబాద్ సౌత్‌లో అత్యధికంగా రూ.103కోట్లు, రాజేంద్రనగర్ సర్కిల్‌లో మరో 84కోట్లు వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే హైదరాబాద్ సెంట్రల్ -38కోట్లు, సైబర్‌సిటీ -36కోట్లు, సరూర్ నగర్- 32కోట్లు,హబ్సిగూడ -29కోట్లు, మేడ్చల్ -20, సికింద్రాబాద్ -10కోట్లు, బంజారాహిల్స్10కోట్లు వరకు పెండింగ్ బకాయిలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ సంస్థలైన జలమండలి, విద్యాశాఖలను కలిసి 3-4వేలకోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

**చౌర్యం పెరిగినా చర్యలు శూన్యం**

ఏటా లక్షల్లో కొత్త విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నా..డిస్కంకు దానికి అనుగుణంగా ఆదాయం పెరగటం లేదు. పలు ప్రాంతాల్లో గృహాలకంటూ విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటూ వాటిని వాణిజ్యానికి వినియోగిస్తున్నారు. టిఎస్ఎస్‌పిడిసిఎల్ అధిక నష్టాలు గ్రేటర్ జోన్ పరిధిలో ఉంటున్నాయి. సర్కిళ్లలో విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు విజిలెన్స్ అధికారులు నామ మాత్రపు చర్యలు తీసుకుంటూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాతబస్తీతోపాటు చంచల్‌గూడ, సంతోష్‌నగర్, భవానీ నగర్, మాదన్నపేట్, యాకత్‌పురా, బేగంబజార్, సీతారాంబాగ్, ట్రూప్‌బజార్, మీరాలం ఫలక్‌నామా సైదాబాద్, బహదూర్‌పురా, కిషన్‌బాగ్, ధూల్‌పేట్, మంగళ్‌హాట్,మెహదీపట్నం వంటి ప్రాంతల్లో భారీగా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. అయితే అధికారులకు తెలిసినా వారిపై చర్యలు తీసుకోకపోవడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

# వైకుంఠ ఏకాదశికి శ్రీవారి ఆలయాలు సిద్ధం



చార్మినార్, డిసెంబరు 21 ప్రభాతవార్త : పాతనగరంలోని పలు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో డిసెంబరు నెల 23వ తేదీన శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. చార్మినార్ సమీపంలోని శ్రీ బాలాజీ మందిరం,చార్‌కమాన్ శ్రీ బాలాజీ మందిరం,లాల్‌దర్వాజ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర మందిరం,చేలాపుర,ఫ త్తెదర్వాజంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలను నిర్వాహకులు ఎంతో సుందరంగా తీర్దిదిద్దారు. పెద్ద ఎత్తు భక్తులు తరలి రానున్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా చార్మినార్ సమీపంలోని చౌక్ మైదాన్ ఖాన్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో డిసెంబరు నెల 23వ తేదీ తేదీ నుంచి జనవరి 16వ తేదీ వరకు శ్రీ వైకుంఠ ఏకాదశి,కరిమ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మందిరం ప్రధాన పూజారి శృంగారం రమణా చార్యులు,అర్చకులు శృంగారం ఆత్రేయ చార్యులు తెలిపారు. శ్రీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం తెల్లవారు జామున 3గంటలకు స్వామి వారికి అభిషేకం, 4 గంటలకు తోమాల సేవ,6 గంటలకు నేత్రదర్శనం, హారతి,6.30 గంటలకు స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం, పల్లకి ఊరేగింపు ఆలయ తిరువీధులలో అతి వైభవంగా జరుగుతుందని వారు తెలియజేశారు. 23వ తేదీ శనివారం జరగనున్న శ్రీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా పాతబస్తీలో భద్రతా ఏర్పాట్లు చేశామని చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ వెల్లడించారు.

# మెట్రో నిండా మగవాళ్లే

### ఉచిత బస్సు.. మెట్రోకు ఎఫెక్ట్



హైదరాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త : ఆర్టీసి ఉచిత ప్రయాణానికి మహిళలు అధిక సంఖ్యలో ఉపయోగించుకుంటుండంతో..మెట్రో స్టేషన్లు, ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్ల వద్ద మహిళల సంఖ్య భారీగా తగ్గింది. మెట్రో రైళ్లలో లేడీస్ రష్ కంటే మగవాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారు. అయితే,రోడ్ ట్రాఫిక్ ఇబ్బందులు ఫేస్ చేయకుండా మెట్రోను ఆశ్రయిస్తున్నారు కొందరు అమ్మాయిలు. అయితే గతం కంటే కొంత లేడీస్ రష్ తగ్గదని, కూర్చోవడానికి మెట్రోలో సీట్లు దొరుకుతున్నాయంటున్నారు ఇతర ప్రయాణికులు. అయితే ప్రస్తుతం నగరంలో ఎండ్ టూ ఎండ్ మెట్రో స్టేషన్లు, ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్ వద్ద తప్ప మిగతా స్టేషన్లు ఖాళీలుగా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడూ మెట్రో స్టేషన్లు, రైళ్లలో లేడీస్ రష్ కంటే మగవాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారు. అయితే మెట్రో స్టేషన్స్ వరకు అలాగే మెట్రో స్టేషన్ నుండి ఆఫీసులకు మహిళలు ఆర్టీసి ఫ్రీ ప్రయాణాన్ని వాడుకుంటున్నారు. నగరంలో భాగా ప్రాచుర్యం పొందిన మెట్రో ఇప్పుడు మగవాళ్లతో నిండిపోతోంది. ఆర్టీసి ఫ్రీ స్కీమ్ ప్రభావం కనిపిస్తోంది. నాన్ పీక్ అవర్స్‌లో మెట్రో రైళ్లు ఖాళీ కనిపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం ఆఫీస్ టైమింగ్స్‌లో మాత్రం మెట్రోలు ఫుల్ అవుతున్నాయి. సాధారణంగా ఆర్టీసి ఉచిత పథకం రాకముందు 5లక్షల వరకు మెట్రో రైడర్ షిప్ నమోదయ్యేది. అయితే, ఆర్టీసిలో మహళలకు ఉచితం ఇవ్వడంతో కొంత వుమెన్ క్రౌడ్ మెట్రో కంటే ఆర్టీసి వైపు మొగ్గు చూపుతున్నారు. దాదాపు 12 వందల నుంచి 15 వందల వరకు సేవ్ అవుతుందంటున్నారు. మరికొందరు మెట్రో స్టేషన్స్ వరకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణం వినియోగించుకుంటూనే రోడ్ ట్రాఫిక్ ఇబ్బందులు ఫేస్ చేయకుండా మెట్రోలో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు లేడీస్ ఎక్కువగా లేకపోవడంతో సీటుల కూడా దొరుకుతున్నాయని మగవాళ్లు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసి ఉచిత ప్రయాణానికి మహిళల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. గ్రేటర్ వ్యాప్తంగా ఆర్టీసి బస్సులు లేడీస్‌తో కిటకిటలాడుతున్నాయి. ఫ్రీ స్కీమ్ అమలైనప్పటి నుంచి బస్సుల్లో సీట్లు దొరకడం లేదంటున్నారు ప్రయాణికులు. ప్రధాన ఏరియాలను కలుపుతూ వెళ్లే బస్సులన్నీ మహిళా ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్నాయి. నగరంలో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగస్తులతో ఆర్టీసి బస్సుల్లో కిక్కిరిసినంత రద్దీ కనిపిస్తోంది. ఇక ఆర్టీసిల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆ ఎఫెక్ట్ కొంత మెట్రో రైళ్లపై కనిపిస్తోంది. లాంగ్ జర్నీ చేసే వాళ్లు తప్పా, ఎక్కువ మంది ఆర్టీసి ఫ్రీ సర్వీసులకు వాడుకుంటున్నారు. ఆర్టీసి ఉచిత ప్రయాణం అమలు వల్ల మెట్రోకు అంత ఎఫెక్ట్ ఉండదని, మెట్రో రైళ్ల క్రౌండ్ సెపరేట్ అంటున్నారు మెట్రో రైల్ అధికారులు. ప్రస్తుతానికి ఆర్టీసి రద్దీ మెట్రో రైళ్లపై ఎఫెక్ట్ చెప్పలేమని, మరో కొద్దీ రోజులు తర్వాత మెట్రో డైలీ రైడర్ షిప్‌పై క్లారిటీ వస్తుందంటున్నారు. సాధారణంగా నగరంలో ఐటీ, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్ ఎక్కువగా మెట్రో జర్నీకి అలవాటు పడ్డారు. దీంతో లాంగ్ జర్నీ చేసే వాళ్లు, ఉప్పల్, ఎల్బీనగర్ నుంచి హైటెక్ సిటీ, రాయదుర్గం, కూకట్‌పల్లి, మియాపూర్ ఏరియాలకు వెళ్లే వారు మెట్రోలో ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా పొల్యూషన్, ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కావడం, బేగంపేట్, పంజాగుట్ట, అమీర్‌పేట్, లక్డికాపూల్ లాంటి ట్రాఫిక్ ఏరియాలను దాటుకొని రావడానికి మెట్రోనే బెటర్ అంటున్నారు. మరికొందరు మహిళలు అయితే సొంత వాహనాలను పక్కన పెట్టి ఆర్టీసి సర్వీసును వాడుకుంటున్నారు. మెట్రోలో వెళ్లే వారు కూడా ఫ్రీజర్నీనీ ఉపయోగించుకుంటున్నారు.



సమావేశంలో పాల్గొన్న బాలల హక్కుల పరిరక్షణ వేధిక సభ్యులు

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

### బాలల హక్కుల పరిరక్షణ వేదిక

అడ్డగుట్ట, డిసెంబర్ 20 ప్రభాతవార్తః అడ్డగుట్టలోని డా. బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో బాలల హక్కుల పరిరక్షణ వేధిక మండల సమావేశం జరిపారు. ఈ కార్యాక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కో కన్వినర్ పి. రమాదేవి మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందడం లేదని తెలిపారు. అలాగే మౌళిక సదుపాయాలు సరిపడా లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మారేడ్‌పల్లి మండలంలో దాదాపు 193 మంది పిల్లలు బాలకార్మికులుగా ఉన్నారన్నారు. మండలం పరిధిలో ఎక్కడా ఉచిత నిర్బంధ విద్య అమలు జరుగడం లేదన్నారు. కార్మికులుగా కొనసాగుతున్న బాల కార్మికులకు విముక్తి చేసి బాలకార్మిక రహిత మండలంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలు జరిపి పిల్లల హక్కులకోసం కృషి చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను విజిట్ చేసి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళడానికి కృషి చేస్తామన్నారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యాక్రమంలో మండల కన్వినర్ ప్రవీణ్, జిల్లా సీఆర్‌ఫీఎఫ్ కార్యదర్శి చింతల లక్ష్మీ నారాయణ, మల్లేష్, భాస్కర్, నరసింహ, కౌసల్య, భారతమ్మ, ప్రకాష్, సందీప్, సువర్ణ, లావణ్య పాల్గొన్నారు.

## ఫీవర్ ఆస్పత్రిలో కొత్త వేరియంట్ అనుమానిత కేసులు



హైదరాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త: జలుబు, దగ్గుతో బాధపడుతున్న ఓ యువకున్ని పరీక్షించిన నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి వైద్యులు కొవిడ్ అనుమానిత కేసుగా, అంతకు ముందు మరో ముగ్గురు అనుమానితులకు కూడా కొవిడ్ పరీక్షలు నిర్వహించారు. ల్యాబ్ రిపోర్టులో ఒకరికి పాజిటివ్ అని తేలినట్లు సమాచారం అందుకున్న ఆ టెస్టుల రిపోర్టు ఇంకా తెలియాల్సి ఉందని ఆస్పత్రి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో చిన్నారులు, వృద్దులు, గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు. అనవసరంగా బయట తిరిగే అలవాట్లను నియంత్రించుకోవాలని సూచిస్తున్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఫేస్ మాస్కులు ధరించాలని, సోషల్ డిస్టెన్స్ పాటించాలని కోరుతున్నారు. తీవ్రమైన బీపీ, షుగర్, హృద్రోగాలు, కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు ఉంటే ఇంట్లోనే ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

**అయ్యప్పభక్తులూ..పారా హుషార్..**

నగరం నుంచి పలు రాష్ట్రాలకు రాకపోకలు సాగించేవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు నగరం నుంచి రాకపోకలు బాగా అధికం. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే కొవిడ్ జేఎన్1 వేరియంట్ కేసులు వెలుగు చూశాయనే విషయాన్ని గుర్తించుకోవాలని, ముఖ్యంగా శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పూర్తి స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## హత్యచేసి చెత్తకుండీలో కాల్చివేశారు

జియాగూడ, డిసెంబర్ 21 ప్రభాతవార్త: నిర్మానుష్య ప్రాంతంలో ఓ వ్యక్తిని అతికిరాతంగా గుర్తు తెలియని వ్యక్తులు హ్యాత చేసి చెత్తకుండీలో వేసి కాల్చివేసిన సంఘటన బుధవారం రాత్రి కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిదిలోని చోటు చేసుకుంది. కుల్సుంపురా డివిజనల్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ మహ్మద్ జావేద్ కథనం ప్రకారం.. వివరాలు ఉన్నాయి. జియాగూడ సంజయ్‌నగర్ ప్రాంతానికి చెందిన అనిల్ ఎలియాస్ లఖన్(40)క్లీన్‌చీట్ పొందిన మాజీ రౌడీషీటర్,అయితే రాత్రి గోపి హోటల్ సమీపంలోని నిర్మానుష ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు అనిల్‌పై దాడి చేసి బండరాళ్లతో కొట్టి హత్య చేసి సమీపంలో ఉన్న చెత్తకుప్పలో పడేసి కాల్చిపడేశారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం ఉదయం కుల్సుంపురా పోలీసులు సమాచారం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్నారు. చెత్తకుండీలో ముందుగా గుర్తుతెలియని వ్యక్తిగా మృతదేహాన్ని కనుకుని పోలీసులు విచారణలో మాజీ రౌడీషీటర్ అనిల్‌గా గుర్తించారు. కాలి చ్చవేసిన ప్రాంతానికి క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలను సేకరించారు. అనంతరం మృతదేహానికి శవ పంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసును కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్యకు గల కారణాలు పాతకక్షలై ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

## పిజి విద్యార్థినులకు ఒయులో హాస్టల్ సౌకర్యం కల్పించాలి



సైఫాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త:నిజాం కళాశాలలో పిజి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు తక్షణమే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది విద్యార్థినీలు గురువారం కళాశాల ప్రాంగణంలో మౌన పోరాట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు తాండూరు వెంకటకౌశిక్, మురళీ ధర్, కార్తిక్ మాట్లాడుతూ 70 మంది విద్యార్థినీలు సైఫాబాద్ హాస్టల్‌లో రెండు రూముల్లో వసతి సౌకర్యం కల్పించారని, కొత్తగా మరో 30 మంది విద్యార్థినీలు వచ్చారని, దీంతో హాస్టల్‌లో విద్యార్థినీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



గౌడ సత్రం నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చేతుల మీదుగా రూ. 11లక్షల డీడీని అందజేస్తున్న బాలగౌని బాలరాజ్‌గౌడ్

## వేములవాడ గౌడ సత్రం నిర్మాణానికి రూ. 30లక్షల విరాళం

హైదరాబాద్, డిసెంబర్ 21 ప్రభాతవార్త : వేములవాడ గౌడ సత్రం నిర్మాణానికి తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ కమిటీ రూ. 30లక్షలు విరాళాన్ని ప్రకటించింది. ఆందులో భాగంగా గురువారం తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, శ్రీ రాజరారాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నం ప్రభాకర్‌గౌడ్ చేతుల మీదుగా గౌడ సత్రం నిర్మాణ పర్యవేక్షకులు పుంజాల హరిచరణ్ గౌడ్‌కు గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ రూ. 11లక్షల రూపాయల డీడీ అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి ఎంకన్నగౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు ప్రమేదాస్‌గౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యాదర్శి బాలగౌని వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయం వద్ద నిరసన




కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 21, ప్రభాతవార్త : పార్లమెంట్‌లో భారత ఉపరాష్ట్రపతిని కాంగ్రెస్ పార్టీ ఎగతాళి చేయడం భారతీయ జనతా పార్టీ తప్పు పట్టింది. దానికి అనుగుణంగా ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ఉపరాష్ట్రపతికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో కూకట్‌పల్లి బిజెపి ఆఫీస్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం కూకట్‌పల్లి అసెంబ్లీ బిజెపి కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు, సూర్యారావు, బిజెపి కార్పోరేటర్ మహేందర్ వివిధ డివిజన్ అధ్యక్షులు హాజరయ్యారు. బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ళు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మాధవరం క్యాంపు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 21, ప్రభాతవార్త : క్రిస్మస్ పర్వ దినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో పలువురు పాస్టర్ల సమక్షంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. సుమారు 200 మంది పాస్టర్లకు సొంత నిధులతో దుస్తులను అందజేశారు. క్రిస్టియన్ మైనార్టీలకు పవిత్రమైన క్రిస్మస్ వేడుకలను అందరూ సుఖ సంతోషాలతో ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు సబిహా గౌసుద్దీన్, ముద్దం నరసింగ్ యాదవ్, డేవిడ్, రత్నం, పాస్టర్లు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుని వర్ధంతి



బేగంబజార్, డిసెంబర్ 21ప్రభాతవార్త: సీనియర్ బిజెపి నాయకులు రాజేశ్వరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పుత్లీబౌలిలో నిర్వహించిన రాజేశ్వరరావు వర్ధంతి కార్య క్రమంలో పలువురు పాల్గొన్ని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ భజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. ఆర్. లక్ష్మన్‌రావుగుప్త, భరత్ కుమార్, వాణిశ్రీ, రమేష్, దనూష్, అరాధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏ ముఖం పెట్టుకొని ప్రజల ముందుకు తిరుగుతారు

సైఫాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త: రాష్ట్ర శాసన సభలో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని, దాడి లంబాడీ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు రఘునాయక్ రూడావత్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పరిస్థితులను శాసన సభ ద్వారా ప్రజలందరికి తెలియజేయడం శుభపరిణామమన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే సమక్షంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను ప్రజలందరికి వివరించడం శుభపరిణామం అన్నారు. ఇంతకాలంలో తప్పుడు విధానాలతో రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించిన బిఆర్ఎస్ ప్రభుత్వ నేతలు ఇప్పుడు ఏముఖం పెట్టుకుని ప్రజల ముందు తిరుగుతారని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిధుల విషయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పే లెక్కలకు వాస్తవ పరిస్థితులకు ఎంతో తేడా ఉందని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉన్నప్పటికి కా ంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటిలను అమలు చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి నిండు సభ లో ప్రకటించడం హర్షంచదగ్గ విషయమన్నారు. పదేళ్ళ క్రితం రాష్ట్ర ప్రభుత్వం మిగుల బడ్జెట్‌లో ఉందని, నేడు ఆరులక్షల కోట్లు అప్పులుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## దళితులకు గ్రామ పంచాయితీలు ఏర్పాటు చేయాలి

### పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్



పి.వి.రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పబ్బతి శ్రీకృష్ణ

సైఫాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త: రాష్ట్రంలో గిరిజనుల పంచాయితీల మాదిరిగానే దళిత గ్రామ పంచా యితీలను ఏర్పాటు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 65 లక్షలకుపైగా ఉన్న ఎస్సీలకు దళిత గ్రామపంచాయితీలను ప్రభుత్వం ఏర్పాటు చేసి తగిన బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. ఈ మేరకు గురువారం ఎస్ఎస్ఎస్‌లో జరిగిన మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు 18వ వర్ధంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. పి.వి.రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోట్లాది మంది ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధన కోసం ఎంతో ఉద్యమించారని, రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్. అంబేద్కర్ కల్పించిన ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించారని ఆయన గుర్తు చేశారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ఉద్యోగాన్ని సైతం కోల్పోవలసి వచ్చిందని, చివరికి న్యూడిల్లీలో ప్రాణాలను అర్పించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.. అంతకు ముందు ఆయన పి.వి.రావు చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సంకి ప్రసాద్, సుధాకర్, వర్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలు చేస్తాం



కోట నీలిమ ను సత్కరిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బేగంపేట డిసెంబరు 21, ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజక వర్గంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలోనే అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ సనత్ నగర్ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు ప్రకటించారు. ఈ మేరకు డాక్టర్ కోట నీలిమ ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేసిన నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ప్రతి కార్యకర్త కృషి చేయడం వల్లే నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వివరించారు. అదే స్థాయిలో రెట్టింపు పనిచేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, నరేష్, మల్లిఖార్జున్, అమానుల్లా ఖాన్, కృష్ణకుమార్ లు మాట్లాడుతూ కోట నీలిమ ఆధ్వర్యంలో అర్హులకు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత పాటించాలి

### కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పోరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 21, ప్రభాతవార్త : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని స్థానిక కార్పోరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డికి ఆదేశాలు ఇవ్వడంతో సనత్‌నగర్ డివిజన్‌లోని రాజరాజేశ్వరి నగర్ కాలనీ, కైలాష్ నగర్ నుంచి స్వామి టాకీస్ వరకు వీడిసిసి రోడ్డు పనులను గురువారం స్థానిక కార్పోరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా తెలంగాణలో అభివృద్ధి పనులు జరగుతూనే ఉంటాయని అన్నారు. ముఖ్యంగా సనత్‌నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభివృద్ధి కార్యక్రమాలను జరిపించడంలో ముందు ఉంటారని ఆయనకు మేము ఎప్పుడు రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, సుభాష్‌నగర్ కౌలాస్ నగర్ ప్రెసిడెంట్ బోగి బాల్‌రాజ్, సూపర్వైజర్ అన్వర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రకాష్‌శర్మ, చక్రవర్తి, ఓమర్, గణేష్ మహిళలు, నాయకురాళ్ళు పుష్పలత, పద్మ, సరితగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శివానంద ఎమినెంట్ సిటిజెన్ అవార్డు ప్రదానం

కంటోన్మెంట్, డిసెంబర్ 21 ప్రభాతవార్త: దేశ విదేశాల్లో ఎంతో పేరు గడించి ఎన్నో అవార్డులు, సత్కారాలు పొందిన ప్రముఖ సైద్ధాంతికవేత్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లో విశిష్ట అధ్యాపకుడు డా. ముతుకుమల్లి విద్యాసాగర్, వైద్య రంగంలో ఎనలేని కీర్తి గడించి, తన అధునిక వైద్యం ద్వారా ఎంతో మందికి తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తున్న గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ పద్మభూషణ్ డా. డి నాగేశ్వర్‌రెడ్డిలకు శివానంద ఎమినెంట్ సిటిజెన్ అవార్డులతో పాటు నగదు పారితోషికం, జ్ఞాపిక, ప్రశంస పత్రాలను బహుకరి ఘనంగా సన్మానించారు. గురువారం టివోలి గార్డెన్స్‌లో జరిగిన ఈ కార్యాక్రమంలో సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి. రామసుబ్రమణియన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహోన్నత వ్యక్తులను సన్మానించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూజ్య సద్గురు శ్రీ శివానంద మూర్తి ఆదేశాలను, ఆశయాలను ఎన్నో ఎళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ఈ కార్యాక్రమంలో సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రాజ్ కందుకూరి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## పేద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత మనందరిపై ఉంది



వైద్య శిబిరంలో పాల్గొన్న లతమా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లతమా

చార్మినార్, డిసెంబరు 21 ప్రభాతవార్త : సమాజంలోని పేద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని లతమా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, విరుంచి ఆసుపత్రి చైర్మన్ లతమా అన్నారు. హరిఓం చారిటబుల్ ట్రస్ట్, లతమా ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దేవిబాగ్‌లోని హరిఓం పాలిక్లినిక్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ప్రజలకు బంజారాహిల్స్‌లోని విరుంచి ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు మరియు మెడికల్‌కు చెందిన పరీక్షలలో 25 శాతం రాయితీని కల్పిస్తున్నామని, ఆధార్ కార్డు చూపించ వలసి ఉంటుందని ఈ అవకాశాన్ని పాతనగరం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హరిఓం పాలిక్లినిక్ ఎండి గౌరీశంకర్ సోనీ, పవన్‌గురు, బిజెపి నాయకులు పవన్‌మిశ్ర, మెఘారాణి అగర్వాల్, పంకజ్‌వర్మ, సరిత, యమన్‌సింగ్, విరుంచి ఆసుపత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

## బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటకరచనలో దిట్ట

### ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి




ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త: బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి నాటక రచనలో దిట్ట అని, ఆయన రచించిన సత్యహరిశ్చంద్ర నాటకం వేల ప్రదర్శనలు జరిగి నేటికి నిత్యనూతనంగా ఉందని శాసనమండలి సభ్యుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి అధ్యక్షతన శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ లక్ష్మీకాంతకవిత అసాధరణ అవధాన పండితుడు అని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాత్రికేయుడు, హాస్యవధాని శంకరనారాయణ మాట్లాడుతు బలిజేపల్లి నాటకర్త కాక నటుడు, స్వాతంత్ర్య సమరంలో జైలుకు వెళ్లారన్నారు. వరవిక్రయం వంటి సినిమాలలో నటించిన ఆయన నాటితరం నటులకు మార్గదర్శనంగా నిలిచారన్నారు. బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ. వినయకుమార్, బిజెపి సీనియర్ నేత, సంఘసేవకులు నైషదం సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఒకే వ్యక్తికి ఇద్దరు దాతల కాలేయం

గచ్చిబౌలి, డిసెంబరు 21 ప్రభాతవార్త : వైద్య చికిత్సల్లో నగర వైద్యులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రోగుల ప్రాణాలను కాపాడుతున్నారు. ఒకే వ్యక్తికి ఇద్దరు దాతల నుంచి సేకరించిన కాలేయాన్ని కాలేయ మార్పిడి ద్వారా అమర్చిన వైద్యులు సరికొత్త చరిత్ర స ృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా నిర్వహించిన ఈ తరహా శస్త్రచికిత్సను నానక్‌రాంగూడలోని స్టార్ ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. ఈమేరకు గురువారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రోగితో పాటు కాలేయ దానం చేసిన రోగి బంధువులు, డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండి గోపిచంద్ మన్నంతో కలిసి లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చీఫ్ డాక్టర్ రాఘవేంద్ర బాబు వివరాలు వెల్లడించారు. కర్నూలుకు చెందిన మహేశ్ లివర్ సిరోసిస్ వ్యాధితో గత అక్టోబరు 23న తమ ఆసుపత్రికి వచ్చాడన్నారు. పరీక్షలు నిర్వహించి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని గుర్తించినట్టు తెలిపారు. మందులతో నయం చేసే అవకాశం లేకపోవడం, అత్యవసరంగా కాలేయ మార్పిడి చేయాల్సి ఉండడంతో కుటుంబ సభ్యులతో చర్చించగా మహేశ్ భార్య, సోదరుడు కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. కాగా దాతల ఆరోగ్య స్థితితో మహేశ్‌కు అవసరమైన 800 గ్రాముల పూర్తి కాలేయాన్ని ఒక్కరి వద్ద నుంచి తీసుకునే అవకాశం లేదని గుర్తించి, ఇద్దరు దాతల నుంచి కాలేయాన్ని సేకరించి మహేశ్‌కు అమర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈమేరకు భార్య వద్ద నుంచి సేకరించిన కాలేయాన్ని మహేశ్ కుడి కాలేయానికి, సోదరుడి వద్ద నుంచి సేకరించిన కాలేయాన్ని ఎడుమ కాలేయానికి అమర్చి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించామన్నారు. ఈ విధమైన శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారి నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం దాతలు, రోగి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఆసుపత్రి డాక్టర్లు తనకు మరో జన్మను ప్రసాదించారని రోగి మహేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాహుల్, రమేశ్ గూడపాటి, ఆదిత్య, భరత్, ప్రవీణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్షదైవం చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని బుధవారం ఆలయాన్ని నీటితో శుద్దిచేసే కార్యక్రమాన్ని ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి. శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగాయి. 23న జరిగే వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ తదితర అంశాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు వివరించారు. భక్తులు ఇక్కడ జరిగే ఏర్పాట్ల విషయంలో ఆలయం నిర్వాహకులతో సహకరించాలని కోరారు. జిహెచ్ఎంసి, వాటర్‌బోర్డు, విద్యుత్తు, పోలీసు శాఖ అధికారులు సిబ్బంది కూడా సహకరించాలని కోరారు. కాగా 22వ తేదీ వరకు పహల్‌పత్తు ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరుగుతాయని, అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు 'దేవాలయం ద్వారబంధనము' ఉంటుంది. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం ఉంటుందన్నారు. 23 నుంచి 27వరకు రాపత్తు ఉత్సవాలు, 27న రాత్రి ఏడు గంటలకు నమ్మాళ్వార్ పరమపదోత్సవం ఉంటుందన్నారు. 2024 జనవరి 11న ఉదయం ఐదున్నర గంటలకు కుడారై ఉత్సవం ఉంటుందని, 14న భోగి పండుగ సందర్భంగా రాత్రి ఏడు గంటలకు గోదా సమేత రంగనాథ స్వామి వారి కల్యాణం ఉంటుందని, 15న మకర సంక్రమణ పర్వదినోత్సవం సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం ఉంటుందన్నారు. 16న కనుమ పండుగ సందర్భంగా ఉదయం 11 గంటలకు గోదాఅమ్మవారి కరినోము ఉత్సవాలుంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. వైకుంఠ ద్వారదర్శనం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయం అధికారులు వెల్లడించారు.

## కూకట్‌పల్లి జెఎన్‌టియూలో నేడు గ్లోబల్ అల్యూమిని మీట్

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 21, ప్రభాతవార్త : హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జెఎన్‌టియూలో నేడు గ్లోబల్ అల్యూమిని మీట్ ఏర్పాటు చేసినట్లు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కట్ట నరసింహా రెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ సురేష్ కుమార్, డైరెక్టర్ గోవర్థన్, రిజిస్ట్రార్ మంజూరు హుస్సేన్‌తో పాఉట ప్రజా సంబంధాల అధికారి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ కార్యాలయం ప్రారంభం

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 21, ప్రభాతవార్త : కూకట్‌పల్లి జెఎన్‌టియూ యూనివర్సిటీ క్యాంపస్‌లో గల ఐఎస్‌టి బిల్డింగ్‌లో నూతన ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి గురువారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్‌గా నియామకం పొందిన డాక్టర్ కె. విజయ కుమార్‌రెడ్డి కాలేజీలో అనేక సంస్కరణలు చేపట్టారు. ప్రిన్సిపాల్ ఆఫీస్ ప్రారంభం చేస్తూ వైస్ ఛాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ మనది సాంకేతిక యూనివర్సిటీ కాబట్టి ముందు మనం మన వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలోకి తెచ్చుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ ఆఫీస్ సకల సౌకర్యాలతో ఉన్నదనీ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. మంజూరు హుస్సేన్, డైరెక్టర్ డా. గోవర్థన్, డా. తార కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. వి. నర్సింహారెడ్డి, అన్ని డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌ఓడిలు ఆయా డిపార్ట్‌మెంట్‌ల యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్స్, జాయింట్ రిజిస్టర్ మాధవరెడ్డి, టీచింగ్ నాన్ టీచింగ్, పొరుగు సేవల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను తగ్గించి శాస్త్రీయ పన్ను విధానం తేవాలి : బిజెపి

నిజాంపేట్, డిసెంబర్ 21, ప్రభాతవార్త : నిజాంపేట్ కార్పోరేషన్ పరిధిలో 2019 జూన్ ముందు నిర్మించబడి ఉన్న ఇండ్లకి ఎలాంటి కారణం లేకుండా రెండింతలు ప్రాపర్టీ టాక్స్ పెంచిన మున్సిపల్ అధికారులు, తగ్గించకుండానే మరొకసారి 12శాతం ప్రాపర్టీ టాక్స్ భూ విలువ ఆధారంగా విధించే ప్రయత్నాలు మానుకోవాలని, జిహెచ్ఎంసి లాగా ఇంటి పన్ను రెంటల్ ఆధారంగా విధించాలని, అదేవిధంగా గత సంవత్సరం పెంచిన పన్నులు తగ్గించాలని బిజెపి ఆందోళన సందర్భంగా సవరిస్తామని హామి ఇచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే పెంచిన పన్నులు తగ్గించాలని గురువారం మున్సిపల్ కార్పోరేషన్ మేనేజర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నిజాంపేట్ కార్పోరేషన్ అధ్యక్షులు ఆకుల సతీష్ మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం నూతన భవనాలు ప్రాపర్టీ అసెస్మెంట్ కోసం అప్లై చేసుకుంటే వారికి సమాత్రమే నూతన మున్సిపల్ చట్టం ప్రకారం ఆస్తి పన్ను అండర్ సెక్షన్ 82 టూ 105 వరకు స్పష్టంగా ఉన్నది. కానీ నిజాంపేట్ కార్పోరేషన్‌లో ఇప్పటివరకు ఒకే ఆస్తిపన్ను విధానం లేకపోవడం కాకుండా, ఇప్పటికి కూడా పంచాయతీరాజ్ చట్టం 2014 ప్రకారం పన్నులు వసూలు చేయడం, కార్పోరేషన్ ఏర్పడి మూడు సంవత్సరాలైనా శాస్త్రీయమైన ఆస్తిపన్ను విధానం ఖరారు చేయకపోవడం గత బిఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ కిషాన్ మోర్చా అధ్యక్షులు ప్రసాద్‌రాజు, సోషల్ మీడియా కో కన్వీనర్ సురేష్, ఓబీసి మోర్చా అధ్యక్షులు మదన్, ట్రెడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, విసి మోచన్ జనరల్ సెక్రటరీ ముఖేష్, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## 24న రవీంద్రభారతిలో 'ప్రవాసీ తెలంగాణ దివాస్'

### తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం




కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న టిడిఎఫ్ ప్రతినిధులు

హైదరాబాద్, డిసెంబర్ 21, ప్రభాతవార్త: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టిడిఎఫ్ -యుఎస్ఏ) ఆధ్వర్యంలో ఈనెల 24న (ఆదివారం) రవీంద్రభారతిలో 7వ ప్రవాసీ తెలంగాణ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిడిఎఫ్-యుఎస్ఏ ప్రెసిడెంట్ దివేష్ అనిరెడ్డి, టిడిఎఫ్ మాజీ అధ్యక్షురాలు కవితా చెల్లా తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిడిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిరెండేళ్లకోసారి ప్రవాసీతెలంగాణ దివాస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమంలో స్కిల్‌డెవలప్‌మెంట్, వ్యవసాయం, నీటిపారుదల, ఆరోగ్య సంరక్షణ రంగాలపై అవగాహన కల్పించనున్నామని అలాగే తెలంగాణ కళాకారులచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అడ్వయిజర్ డిపిరెడ్డి, జైకిసాన్ చైరనమన్ నరేందర్, రణధీర్ బద్దం, అరుణ్ తుల, కన్వీనర్ వినీల్, అంజనా, శివంత్, మహేష్, కోమల్, ప్రియాంక, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## చార్మినార్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన నగర సిపి



చార్మినార్, డిసెంబరు 21 ప్రభాతవార్త : నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట. శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్ పాతనగరంలో పర్యటించారు. నగర పోలీస్ కమిషనర్‌గా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డి మొదటి సారిగా పాతబస్తీకి విచ్చేశారు. ముందుగా సిపి శ్రీనివాస్‌రెడ్డి పాతబస్తీ పురానీహవేలీలో ఉన్న దక్షిణ మండలం డిసిపి కారా ్యలయాన్ని సందర్శించారు. పాతనగరంలోని శాంతి భద్రత విషయాలపై సిపి శ్రీనివాస్‌రెడ్డి డిసిపి సాయి చైతన్యతో సమావేశమయ్యారు. అక్కడ నుంచి చార్మినార్ పోలీస్ స్టేషన్‌కు నగర పోలీస్ కమిషనర్ చేరుకు న్నారు. చార్మినార్ పోలీస్ స్టేషన్, చార్మినార్ ఎసిపి కారా ్యలయాన్ని ఆయన సందర్శించారు. శాంతి భద్రతలతో పాటు సిబ్బంది పని తీరు, బందోబస్తు తదితర విషయాలపై సిపి శ్రీనివాస్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం డిసిపి సాయి చైతన్య, అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్, చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్, చార్మినార్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామితో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సెయింట్ పాల్స్ హైస్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే




వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ముషీరాబాద్, డిసెంబర్ 21, ప్రభా తవార్త: అంబర్‌పేట సెయింట్ పాల్స్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. చిక్కడపల్లి త్యాగరాజగాన సభలో జరిగిన ఈ వేడుకలకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం ఆయనను శాలువాలతో సత్కరించారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందచేశారు. పాఠశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను, విద్యార్థులను, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు.

## ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 తుది పోటీ



స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 ముగింపు వేడుకల్లో విద్యార్థులు

నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త : ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే మంగళవార నోడల్ సెంటర్‌గా ఉన్న కళాశాల ప్రాంగణంలో 36 గంటల పాటు నిర్విరామంగా సాగి రాత్రి 9గంటల ప్రాంతంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏఐసిటిఈ తరపున నోడల్ సెంటర్ హెడ్ యోగేశ్ వాధ్వానీ, నోడల్ సెంటర్ సమన్వయకర్త శివ సిరిపోలు అతిథులుగానూ, జలశక్తి మంత్రిత్వ శాఖలోని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ, రూర్కీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ, సెంట్రల్ గ్రౌండ్‌వాటర్ బోర్డ్, సెంట్రల్ వాటర్ కమీషన్‌లకి చెందిన పలువురు నిపుణులతో జలవనరులు, పారుదల, కృత్రిమమేధ రంగాల్లో నిపుణులైన కళాశాలలో అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ హాకథాన్‌లో జలశక్తి మంత్రిత్వశాఖ నివేదించిన ఐదు సమస్యలపై సమస్యలకి పరిష్కారాలు రూపొందించటానికి దేశం నలుమూలల నుంచి సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు 25 జట్లుగా పాల్గొనగా నాలుగు సమస్యలకు చెరొక జట్టు, ఒక సమస్యకు రెండు జట్లు విజేతలుగా ఎంపికయ్యారు. నోడల్ సెంటర్ ఇన్‌ఛార్జ్, సిఎస్ఈ -ఏఐఎంఎల్ లండ్ లాట్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎ.కౌసర్ నిఖత్, సిఎస్ఈ-డిఎస్‌సిఎస్ అండ్ ఏఐడి విభాగానికి చెందిన సహాయాచార్యులు, హ్యాకథాన్ సమన్వకర్త డా.ఎ.సునంద విజేతలను ప్రకటించారు.

## ఎంఐఎంతో కమ్ముక్కయ్యారనడం సరికాదు

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి**

ఫిల్మ్‌నగర్, డిసెంబర్ 21, ప్రభాతవార్త : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎంఐఎంతో కుమ్మక్కయ్యారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనటం ఆయన స్థాయికి తగదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి మాట్లాడాల్సిన మాటలు అవి కాదని ఎమ్మెల్యే మాగంటి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల అభిమానంతో 2014, 2018, 2023లో ప్రజల ఆదరాభిమానాలతో గెలిచిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యేనని ఈవిషయాన్ని, ముఖ్యమంత్రి మరిచినట్లున్నారని మాగంటి అన్నారు. తనపై అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించే విధంగా ఉన్నాయని ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ఎంఐఎంకు తమకు సంబంధం ఏంటని మాగంటి ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తొలగించాలని ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. లేదా తనపై చేసిన వ్యాఖ్యలన ముఖ్యమంత్రి ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఎవరి దయాదాక్షిణాల మీద తాను గెలవలేదని, ప్రజలు ఆదరాభిమానాలతో గెలిచిన వ్యక్తిని తానని మాగంటి గోపినాథ్ స్పష్టం చేశారు.

## సుభాష్ రోడ్డు డెకరేషన్ షాపులో అగ్ని ప్రమాదం

బేగంపేట డిశంబరు 21,ప్రభాతవార్త : సికింద్రాబాద్ పరిధిలోని సుభాష్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి డెకరేషన్ షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 3నుంచి 4లక్షల రూపాయల మేర నష్టం సంభవించినట్లు బాధితుడు వాపోతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. బోయిగూడాకు చెందిన రాజేశ్వరరావు గడచిన 70 సంవత్సరాలుగా సుభాష్ రోడ్డులో వివాహాలకు సంబంధించిన అలంకార(డెకరేషన్‌షాపు) సామాగ్రిని విక్రయిస్తూ తన జీవనాన్ని సాగిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో షాపు నుంచి పొగలు వస్తున్నాయని, గుర్తించిన స్థానికులు ఈ విషయాన్ని రాజేశ్వరరావుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే షాపు వద్దకు చేరుకుని పరిశీలించగా అప్పటికే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆదుపుచేసారు. ఈ ప్రమాదంలో సుమారు 3నుంచి 4లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాజేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేసారు.

## ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ సమావేశం

చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త: అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ ఫింఛన్‌దారుల దినోత్సవ కార్యక్రమం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నళినిమోహన్, బుచ్చిరాజు ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వి.వి.జనార్ధనరావు, సలహాదారులు కెఎస్ఆర్.ఆంజనేయులు, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంధ్రనాథ్, పి.ఉషారాణిరెడ్డి, ఎం.సుబ్రహ్మణ్యశర్మ, రఘునాథ్, కె.విశ్వేశ్వర రావు, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంఘంలో 80 సంవత్సరాలు దాటిన పెన్షన్‌దారులను సత్కరించి అభినందించారు. ఇదే సభలో 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తొలుత పెన్షన్ కోసం పోరాడిన డిఎస్.నకార చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఫింఛన్‌దారులు, వయోవృద్దులు ఎదుర్కొంటున్న సమస్యలను వక్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.



## వివేకానందకు శుభాకాంక్షలు తెలిపిన కుత్బుల్లాపూర్ ప్రజానీకం

పేట్ బషీరాబాద్, డిసెంబర్ 21, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే కెపి వివేకానందను కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు నన్ను తమ ప్రతినిధిగా భావించి దీవిస్తూ ఇంతటి అఖండ విజయాన్ని అందించినందుకు సదా కృతజ్ఞుడనని అన్నారు. మీరందించిన ఇంతటి విజయంతో నాపై బాధ్యత మరింత పెరిగిందని అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



బేగంబజార్, డిసెంబర్ 20 ప్రభాతవార్త: కిస్మస్ పండుగను, పురస్కరించుకుని టిఎన్‌జిఒ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఒ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ పాల్గొన్ని కేకెకట్ చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అన్ని వర్గాల పండుగలను గౌరవించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, పాస్టర్ ప్రేమ్‌కుమార్, నర్సింగ్‌రావు, విక్రమ్ కుమార్, చంద్రశేఖర్, టిఎన్‌జిఒ విద్యాశాఖ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, టిఎన్‌జిఒ విద్యాశాఖ ప్రతినిదులు దేవిడ్, ఎం.బాస్కర్, ప్రేమ్, రవి, విజయలక్ష్మి, సరళాదేవి, ప్రవీణా, డి.శ్రీకాంత్, అర్చన రమేష్, విలయమ్స్, జేమ్స్, రాణి, సంధ్య, పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయింపు

ఘట్‌కేసర్, డిసెంబర్ 21, ప్రభాతవార్త: మున్సిపాలిటీలోని కాలనీలో రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 12వ వార్డులోని అంబేద్కర్‌నగర్‌లో గురువారం ఆమె సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. మున్సిపల్ నుంచి 12వ వార్డు అభివృద్దికి రూ.10 లక్షలు కేటాయించగా మొదటగా రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు చేపడుతున్నామని ఆమె తెలిపారు.

## కరుణారసం సత్యహరిశ్చంద్రీయము పౌరాణిక పద్యనాటకం



సత్యహరిశ్చంద్రీయము పౌరాణిక పద్యనాటకంలో ఓ దృశ్యం

రవీంద్రభారతి, డిసెంబరు 21 ప్రభాతవార్త : ప్రముఖ రంగస్థల కళావేదిక పురాకృతి సమర్పణ పుట్రేవు పరివార నిర్వహణ, మల్లాది వెంకటరమణ సహకారంతో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ రంగస్థల నటుడు పుట్రేవు రాధాకృష్ణమూర్తి 92వ జయంతిని పురస్కరించుకొని బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్రీయము పౌరాణిక పద్యనాటకం వారణాసి నుండి కాటిసీను వరకు కథావృత్తాంతం, కరుణారసాన్ని ప్రోలిన దృశ్యకావ్యంలో హరిశ్చంద్రుదుగా డివి.సుబ్బారావు, చంద్రమతిగా కెవి.పద్మావతి, నక్షత్రుడుగా చిలువేరు కాంతయ్య, లోహితాస్యుడుగా జివిఎల్.శ్రీరామ్, కేశవుడుగా సిహెచ్‌విఆర్‌కె.మూర్తి, జనార్ధుడుగా ఎం.రామ్మోహనరావు, విశ్వామిత్రుడుగా తోట వెంకటేశ్ ప్రధానపాత్రల్లో అద్భుతంగా నటించి ఆహుతులైన అశేష రంగస్థల నాటకప్రియులను, ఔత్సాహిక ప్రేక్షకులను ఎంతగానో అలరించి ఆకట్టుకుంది. నాటకప్రదర్శనకు ముందు జరిగిన సభాకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన తడకమళ్ళ రామచందర్‌రావు గుడివాడకు చెందిన సీనియర్ రంగస్థల నటుడు-మేకప్‌మెన్ పందార్తి గోపి, ఒంగోలుకు చెందదిన సీనియర్ రంగస్థల నటుడు, డైరెక్టర్ రాయపాటి ఆశీర్వాదంలకు ఘనంగా గౌరవ సన్మానం కావించి అభినందించారు. ప్రదర్శనానంతరం కళాకారులను సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

## అంధ విద్యార్థులకు అన్నదానం



బ్లైండ్ విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న కార్పోరేటర్ రాసూరి సునిత

మెట్టుగూడ, డిసెంబర్ 21 ప్రభాతవార్త: మెట్టుగూడ కార్పోరేటర్ రాసూరి సునిత కుమారుడు ఆర్.కళ్యాణ్‌ను స్మరిస్తూ గురువారం దేవానార్ ఫౌండేషన్‌లో ఉన్న 170 మంది అంధ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని చేయించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ అందవిద్యార్థులకు తనవంతు సేవ చేయడం తన కుమారుడు కళ్యాణ్ జ్ఞాపకార్థం అన్నదానం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పిల్లలకు సేవ చేయడం ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు. వారి సంక్షేమం కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

పేట్ బషీరాబాద్, డిసెంబర్ 21, ప్రభాతవార్త : సెయింట్ అంథోనీ హై స్కూల్‌లో గురువారం కొంపల్లి, సుచిత్రాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జీసస్ పుట్టుక మీద చిన్న నాటక ప్రదర్శన చేశారు. విద్యార్థులు క్రిస్మస్ గురించి అనేక పాటుల, నృత్య రూపకములో అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవిడ్ రాజు విద్యార్థులకు చక్కటి క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. జీసస్ మన అందరికి ప్రేమ, శాంతి, సంతోషంను దేవుని నుండి మనకి ఆయన పుటుట్క ద్వారా బహుమతిగా తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్.పి సుందరరాజు, అకాడమీ డైరెక్టర్ సరితా, కొంపల్లి ప్రిన్సిపాల్ షర్మిళ క్రిస్టి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత దంత, హృద్రోగ, ఇఎన్‌టి, క్యాన్సర్, మధుమేహం వైద్య ఆరోగ్యశిబిరం

చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త: దియాలిబాయ్ లాల్‌చంద్ గౌరీ చారిటబుల్‌ట్రస్ట్, సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఉచిత దంత, హృద్రోగ, ఇఎన్‌టి, క్యాన్సర్, మధుమేహం వైద్య ఆరోగ్యశిబిరం మీరా గౌరీ, దయానంద్‌గౌరీ, అదిలాబాద్ డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కోర్టు జడ్జ్ ససనకోట మాధవి ఆధ్వర్యంలో జరిగింది. మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ సహకారంతో సికింద్రాబాద్ సిటీసివిల్ కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జసిస్టస్ సూరేపల్లి నంద హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిటీసివిల్ కోర్టు చీఫ్ జడ్జ్ యారా రేణుక, సికింద్రాబాద్ సిటీసివిల్ కోర్టు ఫస్ట్ అదనపు జడ్జ్ జె.జీవన్‌కుమార్, మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ సీఓఓ మహేందర్ పాల తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యురాలు అమితా రాణి, డాక్టర్ ఎస్.అవులప్ప, డాక్టర్ శ్యామ్, డాక్టర్ చైతన్య, లతా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న డాక్టర్ ఓలేటి పార్వతీశం తదితరులు

## విద్యార్థులు శ్రద్దగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలి

చిక్కడపల్లి, డిసెంబరు 20 ప్రభాతవార్త: విద్యార్థులు శ్రద్దగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అశోక్‌నగర్ గీతాంజలి హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు స్కూల్ కార్యదర్శి ఎన్.శాంతా ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ విద్యార్థులు అనునిత్యం ఫోన్‌లు దూరం పెట్టి చదువుప శ్రద్ద పెట్టాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రముఖ రచయిత బివిఎస్.రవి, సినీగీతరచయిత సిరాశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

## సిమెంట్ రోడ్డును పరిశీలించిన కార్పోరేటర్



బస్తీ వాసులతో పద్మావెంకట్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త: బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పోరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి దోభిగల్లీలో నూతనంగా వేసిన సిమెంట్ రోడ్డును గురువారం పరిశీలించారు. అలాగే అక్కడున్న మట్టి కుప్పలను తొలగించాలని వారు జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పద్మావెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బస్తీలో ఏలాంటి సమస్యలను ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



సుభాష్‌నగర్ డివిజన్‌లో గల సాయిబాబా నగర్ సంతోష్ నగర్‌లో రూ. 34లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన మాజీ కార్పోరేటర్ సురేష్‌రెడ్డి, స్థానిక నాయకులు

## మిస్సింగ్ మహిళ హత్యకు గురైంది.. భర్తే హంతకుడు



హత్యకు గురైన రాజేశ్వరీ (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, డిసెంబరు 21 ప్రభాతవార్త : తరచూ అనుమానిస్తుందని కట్టుకున్న భార్యనే కిరాతకంగా హతమార్చాడు ఓ భర్త. ఫంక్షన్ ఉందని భార్యను నమ్మించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి భార్య తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేశాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న గృహిణి మిస్సింగ్ కేసు విషాదంగా మారింది. కనిపించకుండా పోయిన గృహిణి కట్టుకున్న భర్త చేతిలోనే హత్యకు గురయినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈమేరకు భర్తను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామానికి చెందిన కమ్మరి రాజేశ్(40) తన భార్య కమ్మరి రాజేశ్వరీ(36), ఇద్దరు పిల్లలతో కలిసి 2011లో బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. మియాపూర్ పరిధిలోని ఎంఎ నగర్‌లో వీరి కుటుంబం నివాసం ఉంటుండగా, రాజేశ్ కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా డిసెంబరు 12వ తేదీన భార్య రాజేశ్వరి కనిపించకుండా పోవడంతో రాజేశ్ భార్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కాగా అల్లుడి ప్రవర్తనపై అనుమానం ఉన్న రాజేశ్వరి తల్లి స్వరూప మియాపూర్ పోలీసుకు పిర్యాదు చేసింది. తన కుమార్తె కనిపించకుండా పోవడం వెనుక అల్లుడి హస్తం ఉండి ఉంటుందని అనుమానం వ్యక్తం చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన మియాపూర్ పోలీసులు భర్త రాజేశ్‌ను ఈనెల 19వ తేదీన అదుపులోకి తీసుకొని విచారించగా, అసలు విషయం వెలుగు చూసింది. పోలీసుల విచారణలో తన భార్యను తానే హత్య చేసినట్లు రాజేశ్ ఒప్పుకున్నాడు. గత రెండు సంవత్సరాలుగా తన భార్య రాజేశ్వరితో తనకు రోజు గొడవలు జరుగుతున్నాయని విచారణలో తెలిపాడు. పిల్లలను తీసుకొని సొంత గ్రామానికి వెళ్లి ఉండాలని రాజేశ్వరికి సూచించగా, అందుకు ఒప్పుకోలేదని, తనను ఎప్పుడూ అనుమానించేదని అన్నాడు. తనకు ఇతర మహిళలతో సంబందాలు ఉన్నాయని అనుమానిస్తుండడంతో రోజు తమ మద్య గొడవ జరిగేదని, గత కొన్ని నెలలుగా ఎవ్వరితో ఫోన్‌లో మాట్లాడినా అనుమానించేదని తెలిపాడు. నవంబరు 30వ తేదీన ఓటు వేసేందుకు తన సొంత గ్రామానికి వెళ్లి వచ్చానని, ఈ క్రమంలోనే డిసెంబరు 2వ తేదీన తిరిగి తన భార్య రాజేశ్వరితో గొడవ జరిగిందన్నాడు. దీంతో తన భార్య అడ్డు తొలగించుకోవాలని పథకం వేసినట్లు తెలిపాడు. ఈ మేరకు డిసెంబరు 10వ తేదీన గండిమైసమ్మ దేవాయలం వద్ద తెలిసిన వారి ఫంక్షన్ ఉందని భార్యను నమ్మించి, తనను రావాలని రాజేశ్ కోరాడు. భర్త పన్నాగం తెలియని రాజేశ్వరి భర్తతో వెళ్లేందుకు అంగీకరించింది. సాయంత్రం 6.30 ప్రాంతంలో హోండా డియో వాహనం (టిఎస్ 13ఈసి 1473) మీద భార్య రాజేశ్వరిని తీసుకొని రాజేశ్ గండి మైసమ్మకు ప్రయాణమయ్యాడు. ఔటర్ రింగురోడ్డు బోరంపేట సర్వీసు రోడ్డు వద్దకు చేరుకున్న తరువాత తన పథకం ప్రకారం ఓ కల్వర్టు వద్ద నిర్మానుష్య ప్రదేశంలో నిలిపివేశాడు. అనంతరం తన భార్యను అక్కడే ఉన్న నిర్మానుష్య ప్రదేశంలోని చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లాడు. కాగా భర్త ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేసిన రాజేశ్వరి అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించింది. దీంతో రాజేశ్ తన భార్యను కిందపడవేసి తలపై బండరాయితో మోదాదు. అక్కడే ఉన్న గ్రానైట్ రాయితో తలపై దారుణంగా కొట్టి హతమార్చాడు. అనంతరం తిరిగి ఇంటికి వచ్చిన రాజేశ్ తన భార్య కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులకు కబురు పెట్టాడు. విచారణలో రాజేశ్ తాను చేసిన నేరాన్ని అంగీకరించడంతో మియాపూర్ పోలీసులు రాజేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా తల్లి చనిపోవడం, తండ్రి జైలు పాటు కావడంతో ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు.

## మహాలక్ష్మి పథకలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలి

**ధర్మసమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ లింగస్వామి**

చిక్కడపల్లి, డిసెంబరు 20 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలని ధర్మసమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ లింగస్వామి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు వివిధ అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్టీసి బస్సులో తెల్లరేషన్‌కార్డు ఉన్న మహిళలకు మాత్రమే అవకాశం కల్పించాలని, నెలకు రూ.లక్ష సంపాదించే మహిళా ఉద్యోగస్తులకు ఉచిత ప్రయాణాన్ని వర్తింపచేయరాదని డిమాండ్ చేశారు. ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికులపై పడుతుందని, ఫలితంగా కార్మికులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని, ఈ నష్టాన్ని భరించడానికి ఆటో నడిపే కార్మికుడికి నెలకు రూ.3వేల చొప్పున ఆర్ధిక సహకారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ మహారాజ్, సైదులు మహారాజ్, మల్లేష్ మహారాజ్, శివమహారాజ్, సైదాబాబు మహారాజ్, నర్సింగ్, దేవానంద్, యుబి.రాములు, పరుశురామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


**వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, Kumari Aparna Subramaniam Dronamraju W/o. Natarajan Amancharla R/o. 29-1408/A/1, West Kakatiya Nagar, Neredmet, Ramakrishna Puram, Hyd-500056. T.S. Changed my Name as APARNA AMANCHARLA.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC

నిటీ నం.44/EE-14/GHMC/2023-24 తేది: 21.12.2023

పనిపేరు: GHMC, KZ, గోషామహల్, డివిజన్-14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా మొత్తం/లక్షలలో : 180.05. బిడ్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 22.12.2023, ఉ.11.00గం. 05.01.2024/ఉ.11.00గం. అధికారి పేరు, చిరునామా : EE-14, GHMC, 5వ అంతస్తు, ఆబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, ఆబిడ్స్, హైదరాబాద్ 9989930428. ఇతర వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, GHMC.

DIPR.No.8889-PP/CL/Advt/1/2023-24 తేది: 21.12.2023


**IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR**
**O.S.NO.72 OF 2008**

BETWEEN:
**GALVAGUDAM SAYAMMA (Died per L.Rs) And others ...PLAINTIFFS**
AND
**GALVAGUDAM RAMULU And others ...DEFENDANTS**

To
**D-5 PARVATHANENI RAJA RAO,**
S/o Late P.Venkataramaiah, Aged about 63 years, Occ: Business, R/o HIG-237, BHEL Town Ship, Ramachandrapuram, Hyderabad-500 032. **...Defendant No.5**

**NOTICE**

The Plaintiffs herein had filed the above suit for Partition and Separate Possession and Cancellation of Registered Sale Deed Dated 18.12.2003 bearing No.3193/2003 and Agreement of Sale-cum-General Power of Attorney, Dated 14.06.2006 bearing No. 8855/2006 and Consequential Injunction in respect of Suit Schedule Property against the Defendants including you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to **04.01.2024 at 10.30 a.m.** Therefore you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
**Sd/- A. KESHAVA REDDY, Advocate**
H.No.3-4-129/A, Street No.6, Barkatpura, Hyderabad.
**Phone: 9246534757**

**IN THE COURT OF THE HONBLE 1st JUNIOR CIVIL JUDGE, C.C.C AT: SECUNDERABAD**
**OS.NO 511 OF 2019**

**BETWEEN:**
**M/s. State Bank of India, having its, Office Situated at R.A.C.P.Center, Secunderabad, Administrative Office, 3st Floor, Patny Circle, Secunderabad -500 003. .... Plaintiff Bank**
**And**
**Sri.Dosapati Praveen Kumar, S/o. Dosapati Prem Das. ... Defendant**

**NOTICE**

To,
Sri.Dosapati Praveen Kumar, S/o. Dosapati Prem Das, Aged: 53 Years, Occ: Business, R/o: H.No.24-60/15, Back Side, of Cine Polis, Malkajgiri, Hyderabad-500 047.

Please take notice that, the plaintiff bank has filed above suit against you for recovery of money amounting to **Rs.66,843/- [Rupees Sixty Six Thousand Eight Hundred and Forty Three only]** and upon you above addressee avoiding the service of summons of the Honorable 1st Junior Civil Judge has directed the plaintiff bank for substitute service in above O.S.No.511 of 2019 by paper publication.

Hence take notice you are hereby informed to appear before the Honorable court 1st Junior Civil Judge, Secunderabad in the above O.S.No. 511 of 2019 at 10.30 A.M. on 03-01-2024 in person or through your Counsel ,failing which the matter will be decided by the Honorable Court in your absence setting you Ex-parte in accordance with Law.

*By Order of the Court.*

Sd/- **Satyavolu. Arun Kumar**
**K.Swapna Latha, G.Siddappa**, Advocates
# 218, 2'nd Floor, Kubera Towers Narayanguda, Hyderabad-500 029.
Cell : 9618038279, 9246585485

**IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE; RANGA REDDY DISTRICT AT : L.B. NAGAR.**
**I.A.NO. 282 of 2023**
**IN**
**O.S. No. 739 of 2022**

Between:
Chandanavelly Sujatha @ Apparus Sujatha. **...Petitioner/Plaintiff.**
**AND**
Chandanavelly Vijaya Laxmi and others. **...Respondents/Defendants/ Proposed Parties.**

**NOTICE**

To, Sri. C. Rahul, S/o Late C. Ram Mohan Rao, Aged 30 year, Occ: Business. Sri C. Deepak Sai, S/o C. Ram Mohan Rao, Aged 26 year, Occ: Business. Both are R/o H.No. 11-133, Sahitinagar, P&T Colony, Dilsukhnagar, Hyderabad- 500060. **...Proposed Respondents 7 & 8.**

Please take notice that the above petitioner/Plaintiff filed above Suit for Partition between the Plaintiff and Defendants before the above said court. The said Suit is posted for your appearance on **24/01/2024.**, you appear before the above said court on **24/01/2024** at 10.30 a.m., either in person or through your Advocate, otherwise the matter will be decided as exparte.

// By order of the Court //
**T.K.SARMA,** Advocate
H.No.17-104, Road No 1, Kamalanagar, Hyderabad.
**Mobile No. 9949958345**

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE MEDCHAL- MALKAJGIRI DISTRICT :: AT MALKAJGIRI**
**O.S. No. 939 of 2023**

Between:-
Smt.Bhattiprolu Rama Lakshmi Veena & others **.. Petitioners**
**AND**
1. Yellampalli Kiran Kumar,
2. The Tahsildar, Malkajgiri Tahsil,
3. All concerned **.. Defendants**

To
All Concerned

Please take notice that the above named Plaintiffs filed the above O.S. No. 939 of 2023 to declare them as absolute owners and possessors of below mentioned suit schedule property, as well as to declare them as legal heirs of late Bhattiprolu Ramesh Babu, who died on **18-10-2020**, against All Concerned and the matter is posted to **24-1-2024** for your appearance and counter, if any. Hence if any person/s is/are having any objection/s, they may appear before this Court on **24-1-2024 at 10-30 A.M.** either in person or through an Advocate, duly instructed by any concerned along with relevant documentary evidence, failing which the matter will be decided on merits.

**SCHEDULE OF PROPERTY**

All that part and parcel of Flat No.102, H.No.25-40/19/2A/F102, M.R. Residency,on Plot No.1, in Sy.Nos.546 to 549, 551 &573,situated at Anantha Saraswathi Nagar, Malkajgiri Mandal, bounded by **NORTH** : Corridor, **EAST** : Corridor,**SOUTH:** Unit No.101, **WEST:** Unit No.103.

**// By order of the Court //**
**AJAY KUMAR BOBBALA**
Advocate
# 30-57/5, Ganesh Nagar, Old Safilguda Malkajgiri, Hyderabad.
**Cell : 9246156248, 9550703060**

## గుడిసెవాసులకు ప్రభుత్వం అండగా నిలవాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

### జాతీయ రహదారి విస్తరణలో గుడిసెల తొలగింపు



గుడిసెవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**హయత్‌నగర్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్‌నగర్ సమీపంలోని రేడియో స్టేషన్ వద్ద గుడిసెలను గురువారం అధికారులు తొలగించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గుడిసె వాసులతో మాట్లాడారు. తమకు పునరావాసం కల్పించాలని గుడిసెవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గతంలో భాగ్యలతకాలనీ నుండి ఆటోనగర్ వరకు క్రీడా ప్రహరీ ఆనుకుని వేసుకున్న గుడిసెలకు కనీస సదుపాయాలు లేకపోవడం... దొంగ కరెంట్ వాడుతున్నారని కేసులు పెట్టడంతో తానే మాట్లాడానని వివరించారు. అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మాణంలో భాగంగా అక్కడినుండి గుడిసెలు రేడియోస్టేషన్ సమీపంలోకి తరలించినట్లు వివరించారు. తాగునీటి, కరెంట్ సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి కలెక్టర్‌తో రెండు సార్లు సమావేశం ఏర్పాటు చేసినా అనివార్య కారణాలతో వాయిదా పడిందని, మరో సారి కలెక్టర్‌తో మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం గుడిసెవాసులకు అండగా నిలవాలని కోరారు.

## మూసారాంబాగ్ మూసీపై నిర్మించే నూతన బ్రిడ్జి నమూనాను మార్చాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ మూసీనదిపై నిర్మించనున్న ప్రతిపాదిత నూతన బ్రిడ్జి నమూనాను మార్చాలని వర్గో సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా మూసారాంబాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు నిరంజన్, సాగర్, కోశాధికారి ధనుంజయ, సలహాదారులు రవీందర్‌రెడ్డి, అశోక్, ప్రకాశం, దశరథ్‌గౌడ్, హమీద్ అన్సారి, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ మూసారాంబాగ్ మూసీనది వద్ద నిర్మించనున్న ప్రతిపాదిక బ్రిడ్జికి ఇరువైపుల నివాసముంటున్న తమకు నూతన బ్రిడ్జిని నిర్మించనుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తమ నివాసాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. నూతన బ్రిడ్జిని నిర్మిస్తుండడంతో బ్రిడ్జి నమూనాకు ఇరువైవపుల ఉన్న సుమారు 40 భవనాలు ప్రభావితమైతాయని తమ ఆస్తులను కోల్పోవలసి వస్తుందని వెంటనే ప్రతిపాదించిన నూతన బ్రిడ్జి నమూనాను మార్చాలని కోరుతున్నామని తెలిపారు. నూతన బ్రిడ్జిన నమూనాను మార్చాల్సిందిగా సంబంధిత జిహెచ్ఎంసి కమిషనర్‌కు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రం అందజేసామన్నారు. మూసారాంబాగ్ మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులను వ్యతిరేకించడం లేదని కాని నమూనా బ్రిడ్జి మూలంగా తమ ఆస్తులను కోల్పోకుండా ఉండడంతోపాటు ఎటువంటి నష్టం, ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## డివిజన్‌లోని పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయండి : కార్పొరేటర్ చేతన



మేయర్ విజయలక్ష్మికి వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ చేతన తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను నిధులు విడుదల చేయాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన పలువురు నేతలతో కలిసి గురువారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో ట్రంక్‌లైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎస్ఎన్‌డిపి ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయని విన్నవించారు. రెండు సంవత్సరాలు అయినా పనులు పూర్తి చేయడంలేదని, సాయిచిత్రనగర్‌లో యుజిడి పనులు పూర్తి చేయాలని, పెద్ద చెరువు బండ్ మీద సుందరీకరణ పనులు పూర్తి చేయాలని కోరారు. దీనిపై మేయర్ విజయలక్ష్మి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, బిజెపి నేతలు పాల్గొన్నారు.

## డిసిసిబి ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యకు కురుమ సంఘం నాయకుల అభినందనలు



సత్తయ్యకు అభినందనలు తెలియజేస్తున్న కురుమ సంఘం నాయకులు

**తుర్కయాంజల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కొత్త కురుమ సత్తయ్య ఎన్నికైన సందర్భంగా తుర్కయాంజల్ కురుమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు వస్పరి బాబయ్య, జనరల్ సెక్రెటరీ గుండ నర్సింహా, డైరెక్టర్ గుండ రాజు, డైరెక్టర్ బంగి లక్ష్మమ్మ, యూత్ అధ్యక్షులు కలకొండ రవీందర్, గుండ లింగమయ్య, గుండ శ్రీశైలం, బొడ్డు శ్రీను, గుండ రాములు, గుండ కృష్ణ, కొత్తకుర్మ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ పరిధిలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల, అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజకవర్గంలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్‌లోని చంచల్‌గూడలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలాల వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధిపనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్, అధికారులు మల్లికార్జున్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి అన్నవర క్షేత్రంలో సత్యనారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** గడ్డి అన్నారం డివిజన్ లలిత నగర్ కాలనీలోని శ్రీ గడ్డిఅన్నవరం క్షేత్రం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 17వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ సభ్యులు తెలిపారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శనివారం 23వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం, చందనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను చేస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఈ నెల 23వ తేదీన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సన్మాన వేడుకలు



ప్రభుత్వ విప్ ఐలయ్యకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కురుమ సంఘం నేతలు

**ఉప్పల్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమకు ఈనెల 23న ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేయనున్నట్లు సంఘం నేతలు గొరిగె మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి రేవు కృష్ణయ్య, అధ్యక్షుడు చౌదరిపల్లి పర్వతాలు, కార్యదర్శి జన్నిరఘు, నోముల మైసయ్య, శాగ పెంటయ్య, గొరిగె ఐలయ్య, సోము జంగయ్య, కొల్లు ఐలయ్య, పి.రాజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కురుమలు అర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. బీర్ల ఐలయ్యతోపాటు, కురుమ వైద్యులను కూడా సత్కరిస్తామని తెలిపారు. ఈనెల 23న ఉదయం 11 గంటలకు బీరప్పగడ్డలో జరిగే సన్మాన కార్యక్రమానికి ఉప్పల్ కురుమ సంఘం నేతలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రాజీతో పెండింగ్‌లో ఉన్న కేసుల మూసివేత..

### ఈ నెల 30వరకు లోక్ అదాలత్ : సీఐ శివకుమార్

**నేరేడ్‌మెట్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** రాజీ మార్గం రాజమార్గమని ఈ నెల 21వ తేదీ నుండి 30వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, ఆస్తి పంపకాలు, భార్యభర్తల పంచాయితీలు, బ్యాంక్ రికవరీ, చెక్‌బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, తగాదాలు, రోడ్ ఆక్సిడెంట్స్, పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు తదితర కేసులను సామరస్యగా పరిష్కరించుకోవడం మంచి అవకాశమని నేరేడ్‌మెట్ సీఐ శివకుమార్ పేర్కొన్నారు. పంతాలకు పోకుండా మానసిక ప్రశాంతత కొరకు రాజీమార్గం ఎంతో ఉత్తమమైనదని తెలిపారు. సమస్యలను సమస్యలుగా కాకుండా పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ఎటువంటి సందేహాలు ఉన్న సెక్టార్ ఎస్సైలు, తనను సైతం సంప్రదించవచ్చన్నారు. అంతేకాకుండా పోలిస్‌స్టేషన్‌లో కూడా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం : ప్రొఫెసర్ కోదండరామ్



ఉప్పల్‌లో జరిగిన తెలంగాణ వెబ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న ప్రొ.కోదండరామ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణలో చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉప్పల్ ఇండస్ట్రీయల్ అసోసియేషన్ ఆడిటోరియంలో తెలంగాణ వెబ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రొ.కోదండరాంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చిన్న తరహా పరిశ్రమల బిల్లుల విషయంలో చాలా మంది నష్టపోయారని, విద్యుత్ విషయంలో వాణిజ్య బిల్లుల సబ్సిడీ కావాలని అడుగుతున్నారని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ వెబ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు డి.వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ తెలంగాణ అవిర్భావానికి ముందు ప్రింటర్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాఠ్య పుస్తకాల ముద్రణాలయం ద్వారా పొందే ప్రింటింగ్ ఆర్డర్లు సరైన సమయంలో ఇచ్చినపప్పటికి బిల్లులు సకాలంలో ఇవ్వలేదన్నారు. గత రెండు సంవత్సరాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పే అండ్ అకౌంట్స్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో బిల్లుల కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు వెంటనే మంజూరు చేయించాల్సిందిగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలంగాణ వెబ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శరవేగంగా నాగోల్ మాడల్ కారిడార్ నిర్మాణ పనులు..!

### వాకింగ్, సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటు : అధికారుల తనిఖీలు

**ఉప్పల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** హబ్సిగూడ నుంచి ఎల్‌బినగర్‌వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హబ్సిగూడ నుంచి ఎల్‌బినగర్ చౌరస్తాకు ఇరువైపులా మాడల్ కారిడార్ నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొంది పనులు చేపట్టారు. ఇందులో భాగంగా మాడల్ కారిడార్ నిర్మించతలపెట్టిన హబ్సిగూడనుంచి ఎల్‌బినగర్‌వరకు ఉన్న రహదారిని కొద్ది రోజుల క్రితం చీఫ్ ఇంజనీర్ జియావుద్దీన్, ఎస్ఇ అశోక్‌రెడ్డి, ఉప్పల్ఇంజనీర్ ఎల్.నాగేందర్, హయత్‌నగర్ ఇంజనీర్ రమేష్‌బాబు, ఎల్‌బినగర్ ఇంజనీర్ కోటేశ్వర్‌రావు పలువురు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పనులు తనిఖీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న కారిడార్ రహదారిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చీఫ్‌ఇంజనీర్ జియావుద్దీన్ మాట్లాతుతూ హబ్సిగూడ జంక్షన్ నుంచి ఎల్‌బినగర్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా మాడల్ కారిడార్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మాడల్ కారిడార్ పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామన్నారు. మాడల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా పాదచారులు నడిచేందుకు ప్రత్యేకంగా పుట్‌పాత్‌లు నిర్మిస్తామని, తద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. అదేవిధంగా ఉదయం, సాయంత్రం నడక వ్యాయామంకోసం వాకర్స్‌కు ఉపయోగించుకునే విధంగా తీర్చి దిద్దుతామని పేర్కొన్నారు. పచ్చదనంతోపాటు, సంతోషకరమైన వాతావరణాన్ని సృష్టించడం, ప్రయాణికులకు పచ్చదనం పెరిగి కాలుష్యం తగ్గుతుందన్నారు. ప్రత్యేక రహదారి పక్కనే సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామని, ఒన నిర్దిష్ట భాగంలో సైకిలిస్టులు, ఆటోమోబైల్ వాహనాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో సైక్లింగ్‌ను ప్రోత్స హించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఉప్పల్ మున్సిపల్ ఇంజనీర్ నాగేందర్



శిల్పారామం, నాగోల్ రహదారిలో సర్వంగా సుందరంగా ముస్తాబు అవుతున్న మాడల్ కారిడార్ దృశ్యం.

తెలిపారు. చిన్న వాహనాల రాకపోకలకు సర్వీసు రోడ్డు ఉపయోగపడుతుందని, భారీ వాహనాలకు ప్రధాన రహదారులు ఉపయోగిస్తా రని, దీని వల్ల ట్రాఫిక్ సాఫీగా సాగడంతోపాటు, ప్రమాదాలు నివారించేందుకు వీలు అవుతుందన్నారు. ప్రధాన రహదారులపై ప్రమాదాలు తగ్గించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ నిఖిల్‌రెడ్డి, నాగమణి, ఎఇ రాజ్‌కుమార్, వసంత, శ్వేతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి కురుమ సంఘం నేతల చేయూత : గొరిగె మల్లేష్



ఉప్పల్‌లో నిరుపేద మహిళకు చేయూత అందిస్తున్న కురుమ సంఘం నేతలు గొరిగె మల్లేష్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో కె.భారతమ్మ కుటుంబానికి ఉప్పల్ కురుమ సంఘం నేతలు చేయూత అందించారు. ఈ మేరకు ఉప్పల్ కురుమ సంఘం నేత గొరిగె మల్లేష్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు గొరిగె ఐలయ్య, చిందం బాలమహేష్, జన్ని వెంకటేష్, గొరిగె నగేష్, బర్ల కృష్ణ, కొండ్ర శ్రీనివాస్, గొరిగె బలరామ్, గొరిగె మహేష్, బట్కిరి ధన్‌సాగర్, కొండ్రు హనుమంతు, నారి నరేందర్, శాగ పెంటయ్య, శాగ శేఖర్, మోటే నరసిహా, శాగ జంగయ్య, బండి వెంకటేష్, బట్కిరి జంగయ్య తదితరులు చేయూత అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గతంలో భారతమ్మ భర్త వెంకటయ్య చనిపోయారని, ప్రస్తుతం ఆమె కూడా చనిపోయిందని, వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారని, వారిని ఆదుకునేందుకు తమ వంతు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. అపదలో ఉన్న కురుమ కులస్థులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

## కాలనీవాసులకు ఇబ్బందిగా మారిన బార్ లైసెన్స్‌ను రద్దు చేయాలి : నవజీవన్‌రెడ్డి



బార్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

**హయత్‌నగర్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** కాలనీవాసులకు ఇబ్బంది కలిగించేలా ఏర్పాటు చేసిన బార్ లైసెన్స్‌ను రద్దు చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వీరభద్ర కాలనీకి ఉన్న నాలుగు ప్రధాన దారుల్లో వైన్స్, బార్ ఉండడం కాలనీవాసులకు ఇబ్బందిగా మారిందని బార్ లైసెన్స్ వెంటనే రద్దు చేయాలని కార్పొరేటర్, కాలనీవాసులు, బీజేపీ నాయకులతో కలిసి బార్ ఎదురుగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైన్స్, బార్ కారణంగా రాత్రివేళ మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మందుబాబులు అటుగా వెళ్ళేవారిపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. మందు సీసాలు ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని, కాలనీ రోడ్ పైనే మూత్ర విసర్జన చేస్తున్నారని పేర్కొన్నారు. మద్యంతోపాటు మత్తు పదార్థాలను సేవిస్తున్నారని ఆరోపించారు. కాలనీరోడ్డులో వెళ్లే వారితో గొడవ పడుతున్నారని వెంటనే బార్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అజయ్, స్వామిగౌడ్, విజయ్‌కుమార్, శ్రీధర్, బీజేపీ నాయకులు పారంద మహేష్, ఉగాది ఎల్లప్ప, గోవిందచారి, సత్యనారాయణ, గంగాని శ్రీను పాల్గొన్నారు.

## విగ్రహావిష్కరణ పనులు నిలిపివేత



విగ్రహావిష్కరణ పనులను నిలిపివేయిస్తున్న సేవా సమితి నాయకులు

**వనస్థలిపురం, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** వనస్థలిపురం రైతు బజార్ సమీపంలోని డబుల్ బెడ్ రూం వసతి గృహ ప్రాంగణంలో అనుమతి లేకుండా ఓ వ్యక్తి విగ్రహావిష్కరణకు పనులు నిర్వహిస్తుండగా మహాత్మ బసవేశ్వర సేవా సమితి నాయకుడు అడ్డుకున్నారు. గురువారం దివంగత వంగవీటి మోహనరంగ విగ్రహావిష్కరణ దిమ్మె కట్టడానికి కూలీలు పని చేస్తున్నారు. విషయాన్ని స్థానికులద్వారా తెలుసుకున్న మహాత్మ బసవేశ్వర సేవా సమితి అధ్యక్షుడు ప్రభాకర్, కిషోర్‌కుమార్, సంతోష్, నీలకంఠప్ప తదితరులు సంఘటనా స్థలానికి వచ్చి నిర్మాణ పనులు నిలిపివేయించారు. అక్కడ పని చేస్తున్న కూలీలను వనస్థలిపురం పోలీసులు విచారించగా తమకు ఏమి తెలియదని దిమ్మె కట్టమని కొందరు వ్యక్తులు చెప్పడంతో తాము కడుతున్నామని పేర్కొన్నారు. ఈ విషయంపై సంఘం నాయకులు జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసుల జోక్యంతో పనులు నిలిపివేసారు. ఈ కార్యక్రమంలో ఎం.శాంతికుమార్, అంజయ్య, గంగం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై అక్రమ పార్కింగ్ : పట్టించుకోని పోలీసులు



ఉప్పల్ అమీనా కాంప్లెక్స్ వద్ద ఉన్న హోటల్ ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్కు చేసిన దృశ్యం.

**ఉప్పల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్ వాహనదారులకు తలనొప్పి వ్యవహారంగా తయారైంది. హబ్సిగూడ నుంచి ఉప్పల్‌కు వచ్చే రహదారిలో అమీనా కాంప్లెక్స్ వద్ద ఉన్న ఒక హోటల్ ముందు అక్రమంగా రోడ్డును ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారిలో వాహనాల పార్కింగ్ కోసం ఎటువంటి సౌకర్యం లేకుండానే హోటళ్లు, రెస్టారెంట్లకు జిహెచ్ఎంసి అధికారులు అనుమతి ఇస్తున్నారు. హోటల్ నిర్వాహకులు పార్కింగ్ కోసం ఎటువంటి సదుపాయం లేకుండానే నడిపిస్తున్నారు. ఇదే క్రమంలో హోటల్‌కు వచ్చే భోజన ప్రియులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి వెళుతున్నారు. దీంతో ఈ రహదారిలో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ఇదేప్రాంతంలో ఉన్న ఒక బిర్యానీ హోటల్‌ముందు కూడా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఇదేతంతు సాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. స్థానికంగా ఉంటున్న కొందరు బడాబాబులు ఈ హోటల్ నిర్వాహకులతో కుమ్మకై అధికారులపై వత్తిడి తీసుకుని వస్తున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి ఈ హోటల్స్ అనుమతి రద్దు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## గ్రేడ్-2 కార్యదర్శిగా రవీందర్‌రెడ్డికి పదోన్నతి



పదోన్నతి పొందిన రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఛైర్‌పర్సన్ అనితానాయక్, ఎస్‌జిఎస్ దామోదర్, వైస్ ఛైర్‌పర్సన్ భూమేష్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లో గ్రేడ్-3 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌రెడ్డి గ్రేడ్-2 కార్యదర్శిగా పదోన్నతి పొంది చౌటుప్పల్‌కు బదిలీ అయ్యారు. గురువారం పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న రవీందర్‌రెడ్డిని మార్కెట్ కార్యాలయంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అనితానాయక్, ఎస్‌జిఎస్ దామోదర్, వైస్‌ఛైర్మన్ భూమేష్, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడు దేవర రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు కట్టా మల్లేశం, డైరెక్టర్లు మైల రవికాంత్, బట్కిరి విద్యానంద్, సల్మాన్‌ఖాన్, యాదగిరి, ఇతర అధికారులు, సిబ్బంది రవీందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో రవీందర్‌రెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహించారని కొనియాడారు.

## బాలుడి గుండె చికిత్స కోసం ఎల్‌ఒసి పత్రం అందజేత : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



బాధిత కుటుంబానికి ఎల్‌ఒసి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలోని సాయిరాం నగర్‌లో నివసించే బాలుడి గుండె చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రూ.లక్షా 50వేల ఎల్‌ఒసి పత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం జరిగిన కార్యక్రమంలో బాధితుడి తల్లిలదండ్రులకు ఎల్‌ఒసి పత్రాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు సిఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుండె సంబంధిత చికిత్స కోసం చిన్నారి బాలుడికి సహాయం అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యలను తన దృష్టికి తీసుకుని రావాలని, తక్షణమే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.